క్లుప్తంగా

గోరింటాకు వేడుకలు



పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

తానూరు: మండలంలోని ఆయా పాఠశాలల్లో మంగళవారం గోరింటాకు వేడుకలు నిర్వహించారు. ఎల్వి జిల్లా పరిషత్ పాఠశాలలో గోరింటాకు పెట్టుకుంటే కలిగే ప్రయోజనా లను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. హెచ్ఎం నరేందర్, ఉపాధ్యాయులు మా. దవ్‌రావ్, సుదర్శన్, లక్ష్మి, శంకర్, రవీందర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

ఖానాపూర్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిశుభ్రత పాటించాలని ఐసీడీఎస్ సీడీపీవో శ్రీలత అన్నారు. మంగళవారం మండలంలోని బాదన్‌కుర్తి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రీ స్కూల్ బోధన కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. గర్భిణులు, బాలింతలు కేంద్రానికి వచ్చి భోజనం చేసేలా చూడాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. సూపర్‌వైజర్ శ్రీలత, టీచర్ లీలారాణి ఉన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎల్‌పీవో

ముధోల్: మండలంలోని రాంటెక్ గ్రామంలో మంగళవారం డీఎల్‌పీవో మోజం మోహినొద్దీన్ విచారణ జరిపారు. మరుగుదొడ్లు, డ్రెయినేజీలు, సీసీ రోడ్ల నిర్మాణ పనుల్లో పంచాయతీ నిధుల దుర్వినియోగం జరిగిందని.. 2002 మే5న మాజీ సర్పంచ్ శ్యాంరావు సమాచార హక్కు చట్టం ద్వారా జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై డీఎల్‌పీవో రాంటెక్ వచ్చి రికార్డులను పరిశీలించారు. గ్రామస్తులను వివరాలు తెలుసుకున్నారు. ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు డీఎల్‌పీవో తెలిపారు. వారి వెంట ఎంపీవో అమీర్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

ముధోల్ ఎమ్మెల్యే నిరసన



పంచెకట్టుతో ఎమ్మెల్యే రామారావ్

భైంసాటౌన్: రైతులకు బేషరతుగా రూ.రెండు లక్షల రుణమాఫీ చేయాలనే డిమాండ్‌తో హైదరాబాద్‌లో బీజేపీ ఎమ్మెల్యేలు నిరసన తెలిపారు. శాసనసభ సమావేశాల ప్రారంభం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా నిర్వహించిన కార్యక్రమంలో ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ పాల్గొన్నా రు. రైతు వేషధారణలో పంచెకట్టుతో హాజరై నిరసన గళం వినిపించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు హామీలు అమలు చేసే వరకు పోరాడతామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

సన్మానం



ఉపాధ్యాయులను సన్మానించిన సిబ్బంది

సోన్: మండలంలోని న్యూవెల్మల్ బొప్పారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 11 ఏళ్లుగా విధులు నిర్వర్తించి పదోన్నతిపై వెళ్తున్న ఉపాధ్యాయులను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు ఉషారాణి, శైలజ, శ్రీనివాస్‌రెడ్డిని హెచ్ఎం విద్యాసాగర్ ఆధ్వర్యంలో శాలువా, పూలమాలతో సన్మానించారు. ఉపాధ్యాయులు లక్ష్మణ్, సాయారెడ్డి, నీల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

భూములకు హద్దుల గుర్తింపు



సర్వే చేస్తున్న తహసీల్దార్ సుజాత, అనిత

కడెం: మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ జీపీ పరిధిలోని పెత్తర్పు సమీపంలో రాంపూర్, మైసంపేట్ పునరావాస గ్రామస్తులకు కేటాయించిన సాగు భూములకు మంగళవారం తహసీల్దార్ సుజాత, ఎఫ్ఆర్వో అనిత సర్వే నిర్వహించారు. గతంలోనే సాగు భూములు కేటాయించినప్పటికీ.. భూముల్లో రాళ్లు ఉండటంతో పంటలు పండించలేదు. ఇటీవల సదరు భూములను చదును చేయించడంతో పాటు లబ్ధిదారులకు తమ భూమి హద్దులను చూపినట్లు అధికారులు పేర్కొన్నారు

నిర్మల్‌లో పడకేసిన పారిశుధ్యం

- పట్టణంలో అస్తవ్యస్తంగా డ్రెయినేజీలు
- పొంచి ఉన్న రోగాల ముప్పు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



సాగర్‌కాలనీలో చెరువును తలపిస్తున్న ఖాళీ స్థలం

నిర్మల్‌టౌన్: మున్సిపాలిటీలోని వార్డులు సమస్యలకు నిలయంగా మారాయి. ఖాళీస్థలాల్లో పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడం, ఇష్టానుసారం చెత్తాచెదారం పడేయడంతో శుభ్రత కరువైంది. పట్టణంలో డ్రెయినేజీలు సరిగా లేక ఇళ్ల మధ్య నిలుస్తున్న మురుగునీటితో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్తాచెదారంతో దోమలు, పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. సీజనల్ వ్యాధులైనా డెంగీ, మలేరియా విజంభిస్తున్నప్పటికీ మున్సిపల్ అధికారులు పారిశుధ్య చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్య చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ప్రధాన వీధుల్లో..

నిర్మల్ పట్టణంలో ప్రధాన వీధులైన ప్రియదర్శినినగర్, సాగర్‌కాలనీ, శ్రీనగర్, రవినగర్, ఆదర్శనగర్, ఎన్టీఆర్‌మార్గ్, దివ్యనగర్, ఇంద్రనగర్, శాస్త్రీనగర్, బాగులవాడ, రాంనగర్, మంజులాపూర్‌లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఖాళీప్లాట్లలో పిచ్చిమొక్కలు పెరగడంతో నీరు నిలిచి కుంటలను తలపిస్తున్నాయి. దీనికి తోడు చుట్టుపక్కల ఇళ్లవారు చెత్త పడేస్తుంటంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. పాములు, పందులు సంచరిస్తున్నాయి.

కానరాని డ్రెయినేజీలు..

జిల్లా కేంద్రంలోని కాలనీల్లో డ్రెయినేజీలు కనబడవు. అలా అని పట్టణమంతా అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ ఉందనుకుంటే పొరపాటే. కొన్నిచోట్ల చిరువ్యాపారులు మురుగుకాల్వలను ఆక్రమించుకొని వ్యాపారం నిర్వహిస్తున్నారు. ప్రియదర్శనినగర్, శ్రీనగర్, ఆదర్శనగర్ కాలనీల్లో డ్రెయినేజీలు అధ్వానంగా ఉన్నాయి. పలుచోట్ల కందకాలు



ఇంద్రనగర్ కాలనీలో ఓ ఖాళీస్థలంలో పెరిగిన పిచ్చిమొక్కలు



ఎన్టీఆర్‌మార్గ్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు

ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారంతో పేరుకుపోయాయి. ఏళ్లుగా సమస్యలు అలాగే ఉన్నా.. పరిష్కారానికి నోచుకోవడం లేదు. పట్టణంలో మొత్తం 266 మంది పారిశుధ్య కార్మికులు ఉండగా వారిలో 14 మంది రెగ్యులర్ సిబ్బంది ఉన్నారు. మిగతా వారంతా కాంట్రాక్ట్ ఉద్యోగులే.

దోమల నివారణకు చర్యలేవి?

వర్షాకాలంలో విష జ్వరాలు విజంభిస్తున్నా.. దోమల నివారణకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. పట్టణంలోని పలు కాలనీల్లో దోమల నివారణ మందు, శానిటేషన్ చర్యలు చేపడితే ప్రజలు రోగాల బారిన పడకుండా ఉంటారు. అధికారులు, ప్రజాప్రతినిధులు నివాసం ఉండే చోట మాత్రం దోమల నివారణమందు, శానిటేషన్ చేస్తున్నారని.. సాధారణ ప్రజలను పట్టించుకోవడం లేదని పట్టణవాసులు ఆరోపిస్తున్నారు. దోమల నివారణకు మున్సిపల్ సిబ్బంది చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

రోగాల బారిన పడుతున్నాం



పట్టణంలో పరిశుభ్రత లోపించడంతో రోగాల బారిన పడుతున్నాం. దోమల నివారణకు, కందకాలు, డ్రెయినేజీలు శుభ్రంగా ఉండేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలి. ఖాళీ ప్లాట్‌లో పేరుకుపోయిన పిచ్చిమొక్కలను, నిల్వనీటిని తొలగించాలి. దోమలు రాకుండా కాలనీలో స్ప్రే చేయించాలి.

– మహేశ్‌కుమార్, శాంతినగర్, నిర్మల్

సమస్యలు పరిష్కరించండి..



కాలనీలో ఇళ్ల మధ్య మురుగునీరు నిలుస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నాం. ఖాళీప్లాట్లలో పిచ్చిమొక్కలు పెరగడంతో పాములు, పందులు, తేళ్లు సంచరిస్తున్నాయి. చిన్నారులతో బయటకు రావాలంటేనే భయంగా ఉంది. మాకు తీవ్రంగా ఇబ్బంది అవుతుంది. అధికారులు మా సమస్యలను త్వరగా పరిష్కరించాలని వేడుకుంటున్నాం.

– రంజిత్, మంజులాపూర్, నిర్మల్

చర్యలు తీసుకుంటాం..

వర్షాకాలం మొదలైనప్పటి నుంచి డ్రెయినేజీల పక్కన శానిటేషన్ చేస్తున్నాం. పలు డ్రెయినేజీల్లో పూడికతీత చేపట్టాం. పెరిగిన పిచ్చిమొక్కలతోపాటు ఖాళీస్థలాల్లో నిల్వనీటిని తొలగించేలా చర్యలు తీసుకుంటాం. ప్రజలు జ్వరాల బారిన పడకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లించి, దోమల నివారణ మందు స్ప్రే చేయిస్తాం.

– దేవిదాస్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్

మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కేసు



భైంసారూరల్ : బైక్ తనిఖీ చేస్తున్న సీఐ నైలు

భైంసారూరల్: మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామని సీఐ నైలు అన్నారు. మంగళవారం మండలంలోని మాటేగాం టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ధ్రువపత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. అన్ని పత్రాలు వెంట ఉంచుకోవాలని వాహనదారులకు సూచించారు. తనిఖీలో ఏఎస్సై మారుతి, పోలీసులు ఉన్నారు.

అపరిచితులకు వ్యక్తిగత వివరాలు చెప్పొద్దు

లక్ష్మణచాంద: రోజురోజుకు సైబర్ నేరాలు పెరుగుతున్నాయని.. అపరిచితులకు బ్యాంకు, ఆధార్ వంటి వ్యక్తిగత వివరాలు చెప్పవద్దని సోన్ సీఐ నవీన్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని కేజీబీవీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఆకతాయిలు వేధిస్తే భయపడకుండా డయల్ 100కు ఫిర్యాదు చేయాలన్నారు. తమ ఇంటి వద్ద తల్లిదండ్రులకు రోడ్డు భద్రత నిబంధనలు, అపరిచితుల నుంచి వచ్చే కాల్స్‌కు స్పందించొద్దని చెప్పాలన్నారు. చెడువ్యసనాలకు దూరం ఉండి.. చదువుపై దృష్టి సారించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్సై సుమలత, ఎస్‌వో నవిత, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

రోడ్లపై కేజీవీల్స్ నడిపితే చర్యలు

లక్ష్మణచాంద: రోడ్లపై కేజీవీల్స్‌తో కూడిన ట్రాక్టర్లు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సుమలత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు కేజీవీల్స్‌ను రోడ్లపై నడపకుండా ట్రాలీలో లేదా రబ్బరు తొడుగులతో పొలాల వద్దకు తీసుకెళ్లాలని సూచించారు. రైతులూ సహకరించాలని కోరారు.

'ఆశయ సాధనకు పోరాడుదాం'

నిర్మల్‌చైన్‌గేట్: సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ కేంద్ర కంట్రోల్ కమిటీ చైర్మన్‌గా పని చేసిన రాయల చంద్రశేఖర్ ఆశయ సాధన కోసం పోరాడుదామని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ (ప్రజా పంథా) జిల్లా కార్యదర్శి కె.రాజన్న అన్నారు. విప్లవ యోధుడు రాయల చంద్రశేఖర్ సంతాప సభ జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) నాయకులు కె.లక్ష్మి, గంగామణి, కవిత, చిట్టి,లక్ష్మి, శ్రీనివాస్, పోశెట్టి, దత్తు పాల్గొన్నారు.

'ఉపాధి'గ్రామసభలు

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర, పంచగుడి, లోకేశ్వరం, మన్మద్, అబ్దుల్లాపూర్, బామ్ని(కే), సేవాలాల్‌తండా గ్రామాల్లో ఉపాధిహామీ సామాజిక తనిఖీ గ్రామసభలు నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధిహామీ సామాజిక తనిఖీ ఎస్సార్పీ సురేందర్ మాట్లాడారు. ఈనెల 24 లోకేశ్వరంలోని రైతువేదికలో నిర్వహించే సామాజిక తనిఖీ ప్రజావేదికకు కూలీలు హాజరవాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్పీలు వెంటేశ్వర్లు, చిరంజీవి ఉన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

కుంటాల: ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేస్తే గుర్తింపు లభిస్తుందని ఎంఈవో ముత్యం పేర్కొన్నారు. కుంటాల ప్రాథమిక పాఠశాలలో పని చేసిన హెచ్ఎం సక్రపు గజేందర్, ఉన్నత పాఠశాలలో పని చేసిన శ్రీనివాస్ బదిలీపై వెళ్లడంతో మంగళవారం వారిని సన్మానించారు. పీఆర్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరేంద్రబాబు, రమణారావు, సతీశ్‌కుమార్, నరేశ్‌కుమార్, అమృతం, సిద్ధిరాం, హెచ్‌డబ్ల్యూవో నగేశ్ పాల్గొన్నారు.

పొట్టపెల్లి(కే)లో..

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి(కే) ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేసిన కల్పనారెడ్డి.. ఇటీవల బదిలీపై నిర్మల్‌రూరల్ మండలం భాగ్యనగర్ పాఠశాలకు వెళ్లారు. మంగళవారం పొట్టపెల్లి(కే)పాఠశాలలో కల్ప నారెడ్డిని వీడీసీ ఆధ్వర్యంలో సన్మానించారు. హెచ్ఎం సత్యనారాయణ ఉపాధ్యాయులు నర్మద, కార్యదర్శి శ్రీనివాస్, వీడీసీ సభ్యులు మల్లేశ్, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

'బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం'

కుంటాల: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని బీఆర్ఎస్ మండల కన్వీనర్ పడకంటి దత్తాద్రి, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పెంటవార్ దశరథ్ పేర్కొన్నారు. మంగళవారం కుంటాలలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా నరేందర్

ఖానాపూర్: మున్నూరుకాపు సంఘం ఖానాపూర్ అధ్యక్షుడిగా పస్పుల నరేందర్ ఎన్నికయ్యారు. మంగళవారం పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీ లోని సంఘ భవనంలో జరిగిన సమావేశంలో సభ్యులు అధ్యక్షుడిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడితోపాటు తాజా మాజీ అధ్యక్షుడు పాదం రాజన్నను సభ్యులు సన్మానించారు.

శిశుమందిర్‌లో దేశభక్తి దివస్

భైంసాటౌన్: పట్టణంలోని గుజిరిగల్లీ శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో మంగళవారం దేశభక్తి దివస్ నిర్వహించారు. ఈసందర్భంగా దేశం కోసం ప్రాణాలర్పించిన చంద్రశేఖర్ ఆజాద్, బాలగంగాధర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. స్వాతంత్ర సమరయోధులను స్ఫూర్తిగా తీసుకోవాలని ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచించారు.

వారసంత వేలంలో పాల్గొనాలి

తానూరు: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో ఈనెల 25న నిర్వహించే వారసంత వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి కలవారు తమ పేర్లు నమోదు చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి జలంసింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు ఉన్నతాధికారుల సమక్షంలో వారసంత వేలం వేయనున్నట్లు తెలిపారు. సంతలో పాల్గొనేవారు ఈనెల 24న సాయంత్రం 4 గంటల్లోగా రూ.5 వేలు చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు తానూరు పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కుంటాల: వానాకాలం సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఆదిలాబాద్, రాజేంద్రనగర్ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ బి.రాంప్రసాద్, డాక్టర్ టి.కిరణ్‌బాబు సూచించారు. మంగళవారం రైతునేస్తంలో భాగంగా కుంటాల రైతువేదికలో పాల్గొన్న రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పత్తి సాగుపై అవగాహన కల్పించారు. భైంసా ఏడీఏ వీణ, ఏవో సోమలింగారెడ్డి, ఏఈవోలు శ్రీధర్, మహేశ్, గణేశ్, ప్రగతి పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ అమలుకు వినతి

లక్ష్మణచాంద: బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని కోరుతూ మండల బీజేపీశాఖ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం తహసీల్దార్ జానకికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ డిక్లరేషన్ అమలు చేయకుండా కాలాయాపన చేస్తుందన్నారు. హామీల అమలుపై ప్రకటన చేయకుంటే కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు చేపడుతామని పేర్కొన్నారు. బీజేపీ ఓబీసీ మోర్చా మండలాధ్యక్షుడు నాగుల రాజ్‌కుమార్, మండల అధ్యక్షుడు పోలాస గోవర్ధన్, రంజిత్, రాజు, గంగాధర్ పాల్గొన్నారు.

ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలి

భైంసాటౌన్: యువతులు, మహిళలందరికీ తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని డీఎంహెచ్‌వో ధన్‌రాజ్ సూ చించారు. మంగళవారం పట్టణంలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఆరోగ్య మహిళ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మా ట్లాడారు. ప్రతి ఆశవర్కర్ ముగ్గురు మహిళలను ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చి ఆరోగ్య ప రీక్షలు నిర్వహించేలా చూడాలన్నారు. అ నా రోగ్య సమస్యలు దృష్టికి వస్తే సత్వర చికిత్స అందించాలని.. లేకుంటే జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేయాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో ఇద్రిస్ ఘోరి, యూపీహెచ్‌సీ వైద్యురాలు ఫిర్దోస్ జుబీనా, సిబ్బంది, ఆశవర్కర్లు ఉన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

లోకేశ్వరం: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని భైంసా డిపో సేఫ్టీవా ర్డెన్ లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మంగళవారం లోకేశ్వరం బస్టాండ్‌లో భైంసా డిపో ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సురక్షితంగా గమ్యం చేరేందుకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించాలని కోరారు. ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆర్టీసీ అధికారులు శంకర్ జాదవ్,రావు, విలేజ్ బస్ అధికారి బండారి సాయన్న ఉన్నారు.

దివ్యాంగురాలికి చేయూత

లోకేశ్వరం: మండలంలోని ధర్మోరలో దుబ్బ ముత్తమ్మ అనే దివ్యాంగురాలికి మాఅమ్మ-నాన్న ఫౌండేషన్ చైర్మన్ ఆంజనేయులు నిత్యావసర సరుకులు అందించారు. దాతలు ముత్యంరెడ్డి, ఫర్జానాబేగం, కూన సుకుమార్, రాములు సహకారంతో మూడు నెలలకు సరిపడ నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

హైవేపై నిర్వహణ పనులు

సాక్షి స్పందన



రోడ్డుపై మట్టి, పిచ్చిమొక్కలను తొలగిస్తున్న సిబ్బంది

భైంసాటౌన్: పట్టణంలో 61వ నంబర్ జాతీయ రహదారి నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండటంతో ఈనెల 21న సాక్షిలో 'హైవే నిర్వహణపై పట్టింపేది..?' శీర్షికన కథనం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం హైవే నిర్వహణ సంస్థ సిబ్బంది పట్టణంలో పనులు ప్రారంభించారు. పొక్లెయిన్‌తో రోడ్డుపై పేరుకున్న మట్టి, చెత్త, పిచ్చిమొక్కలు తొలగించారు. హైవే హద్దులు వాహనదారులకు కనిపించేలా చర్యలు చేపట్టారు.

రైతుబీమా దరఖాస్తుల స్వీకరణ



కుంటాలలో దరఖాస్తు స్వీకరిస్తున్న ఏడీఏ వీణ

కుంటాల: వచ్చే నెల 5లోగా రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని భైంసా ఏడీఏ వీణ పేర్కొన్నారు. మంగళవారం కుంటాల రైతువేదికలో ప్రజావాణిలో భాగంగా రైతుల నుంచి రైతుబీమా దరఖాస్తులను స్వీకరించారు. దరఖాస్తు ఫారం, పట్టాదారుపాసు పుస్తకం, ఆధార్, నామినీ పత్రాలను జతపర్చాలని కోరారు. ఏవో సోమలింగారెడ్డి, ఏఈవోలు శ్రీధర్,గణేశ్, మహేశ్, ప్రగతి ఉన్నారు.

సారంగపూర్: మండలకేంద్రంలోని రైతువేదికతో పాటు ఆయా గ్రామాల్లో ఏఈఓలు మంగళవారం రైతుబీమా దరఖాస్తులను స్వీకరించారు. ఈసందర్భంగా ఏఓ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గత నెల 28 తర్వాత పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గతంలో దరఖాస్తు చేసుకున్నవారు తప్పులుంటే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

లక్ష్మణచాంద: మండల కేంద్రంతోపాటు పీచర, వడ్యాల్ గ్రామాల్లో రైతువేదికల వద్ద మంగళవారం ఏఈవోలు ఉమామహేశ్వరి, సంతోష్, పవిత్ర రైతుబీమా దరఖాస్తులు స్వీకరించారు.

'సీడీపీవో అవినీతిపై విచారణ చేయండి'



మాట్లాడుతున్న నాయకులు

ఖానాపూర్: ఉన్నతాధికారులు ఖానాపూర్ ఐసీడీఎస్ సీడీపీవో సరిత అవినీతి, అక్రమాలపై విచారణ చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తన తప్పును కప్పిపుచ్చుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు మాని.. సక్రమంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు దాకూరి తిరుపతి, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తొడసం శంభు, సీఐటీయూ నాయకులు చుంచుల నారాయణ, తదితరులు ఉన్నారు.

నిల్వనీటితో దోమల వ్యాప్తి



ఖానాపూర్: నీటిని పారబోయిస్తున్న కమిషనర్

ఖానాపూర్: పరిసరాల్లో నీరు నిల్వ ఉండటంతో దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడతామని మున్సిపల్ కమిషనర్ మనోహర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని సుభాశ్‌నగర్‌లో మున్సిపల్, వైద్య సిబ్బందితో కలిసి కాలనీవాసులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయా నివాసాల్లోని పూలకుండీలు, కూలర్లలో నిలవ్వనీటిని పారబోయించారు. కార్యక్రమంలో షబ్బీర్ పాషా, సంతోశ్, నారాయణ, లావణ్య, పుష్ప, మమత, తదితరులున్నారు.

తానూరు: ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో అబ్దుల్ సమద్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో డ్రై డే సందర్భంగా వీధుల్లో పర్యటించారు. ఖాళీకుండలు, పాతటైర్లలో వర్షపునీరు నిల్వకుండా చూసుకోవాలని స్థానికులకు సూచించారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి జలంసింగ్, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చివేత.. పోలీసులకు ప్రశంసలు



గుంతల్లో మట్టి నింపిస్తున్న పోలీసులు

మామడ: ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలోని నల్లుర్తి నుంచి దిమ్మదుర్తికి వెళ్లే రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఆ మార్గంలో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. దీంతో సీఐ నవీన్‌కుమార్, ఎస్సై సందీప్ స్పందించి మొరం పోయించి ప్రమాదకర గుంతలను పూడ్చివేయించారు. దీంతో మండలవాసులు పోలీసులను ప్రశంసిస్తున్నారు.

వర్షపు నీటితో ఇబ్బందులు



దొడాపూర్‌లో మునిగిన రోడ్డు

బాసర: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలోని టాక్లీ, దొడాపూర్, లాబ్ది గ్రామాల్లో రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. డ్రెయినేజీల్లో పూడికతీయకపోవడంతో నీరు బయటకు వెళ్లలేక రోడ్డుపైకి చేరిందని గ్రామస్తులు పేర్కొన్నారు. పలుచోట్ల వరద ఇళ్లలోకి కూడా వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి డ్రెయినేజీల్లోని పూడికను తొలగించాలని వేడుకుంటున్నారు.



లాబ్దిలో వర్షానికి దెబ్బతిన్న రోడ్డు

ఫిజియోథెరపీ

తానూరు: మండల కేంద్రంలోని భవిత విద్యా వనరుల కేంద్రంలో మంగళవారం దివ్యాంగులైన విద్యార్థులకు ఫిజియోథెరపీ నిర్వహించారు. 23 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు ఫిజియోథెరపిస్ట్ శ్రీనివాస్ తెలిపారు. భూమన్న, రాము పాల్గొన్నారు.